

కొబ్బరి ధర అదుర్స్
కొబ్బరి రైతుల పంట పండింది. కొబ్బరికాయ ధర రూ.17 పలకడంతో కొబ్బరి రైతులు లాభాలను చూస్తున్నారు. అంతర పంటలతో కూడా ఆదాయం వస్తోంది. 8లో ▸



పైసలిస్తేనే మీటర్లు
తణుకు విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయ సేవలకు అవినీతి మరకలు అంటుతున్నాయి. పైసలిస్తేనే మీటరు అని కొందరు అందినకాడికి గుంజేసే పరిస్థితి నెలకొంది. 8లో ▸



అందుబాటులో విత్తనాలు
విత్తనోత్పత్తి చేసే రైతులకు మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో బ్రీడర్ సీడ్ అందుబాటులో ఉన్నాయని పరిశోధనా సహ సంచాలకుడు తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

పునరావాస కేంద్రం పరిశీలన



దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

కుక్కునూరు: గోదావరి వరదల దృష్ట్యా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు మంగళవారం పలువురు అధికారులు మండలంలోని దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస సహాయక కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వరద బాధితులకు పునరావాస కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు చేపట్టారు. దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీని సందర్శించిన వారిలో పంచాయతీ రాజ్ ఎస్ఈ కె.శ్రీను, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జి.త్రినాథ్‌బాబు, గృహనిర్మాణ శాఖ పీడీ జి.సత్యనారాయణ తదితరులున్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాఠశాలలో ప్రస్తుతం ఎస్ఏ ఉర్దూ, ఎస్ఏ గణితం, ఎస్ఏ పీఎస్ ఉపాధ్యాయులు లేనందున వెంటనే అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించాలని మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రం సమర్పించారు. కొన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందనందున పూర్తిస్థాయిలో చేరేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పాటు తూర్పువీధి ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల, తల్లిదండ్రుల కోరిక మేరకు ఇంగ్లీషు మీడియంలోనే బోధన కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓకు వినతిపత్రం సమర్పించిన వారిలో ఏపీటీఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యుడు ఎస్‌కే రంగావలి, రూరల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామశేషు కుమార్, శ్రీనివాస్ తదితరులున్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి



పూళ్లలో గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు

భీమడోలు: కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న దేశ వ్యాప్తంగా తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు కోరారు. పూళ్ల రైస్ మిల్లు వర్కర్లతో కలిసి గోడ పత్రికలు, కరపత్రాలను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పని చేస్తున్న కోట్లాది మంది కార్మికులు కనీస వేతనాలు లేక పీఎఫ్, ఈపీఎఫ్ పింఛన్ ప్రమాద బీమా లాంటివి లేనందున అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు భద్రత కల్పించాలని కోరారు. వివిధ శాఖల్లో పని చేసే ఉద్యోగులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వెంకటేశ్వరరావు, బెండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అధికారులకు రాష్ట్ర స్థాయి అవార్డులు

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు జిల్లా అధికారులు జూలై 9న విజయవాడలో గవర్నర్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ అవార్డులు అందుకోనున్నారు. అవార్డులు పొందిన వారిలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి ఎం.ఎస్.ఎస్.వేణుగోపాల్, మాజీ విద్యా శాఖ అధికారి ఆర్.వెంకటరమణ ఉన్నారు. వీరు 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో రెడ్‌క్రాస్ కోసం రూ.5 లక్షలకుపైగా నిధులు సమీకరించారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షురాలు చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ డా.ఎం.ఎస్.వి.ఎస్.భద్రిరాజు, వైస్ చైర్మన్ పబిలిసెట్టి కనకరాజు తదితరులు అభినందనలు తెలిపారు.

వాడవాడలా.. వైఎస్సార్ స్మృతిలో

- వాడవాడలా ఘనంగా వైఎస్సార్ 76వ జయంతి
- మహానేత విగ్రహాలకు నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు
- నరసాపురంలో రక్తదాన శిబిరం
- జిల్లా వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు



భీమవరంలో నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట రాయుడు



తణుకులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు



తాడేపల్లిగూడెంలో నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ఆచంటలో చెరుకువాడ నరేష్ రాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు



పాలకొల్లు ఆస్పత్రిలో పండ్లు అందజేస్తున్న పార్లమెంట్ పరిశీలకుడు మురళీకృష్ణంరాజు, మంగతాయారు తదితరులు

సాక్షి, భీమవరం: జోహార్.. వైఎస్సార్.. అంటూ జనహృదయ నేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతిని జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మనసున్న మారాజు ఆ మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున రక్తదానం, అన్నదానంతో పాటు చీరలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలతో అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ప్రజలే ప్రాణంగా, పేదల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్ పాలన సాగించారని కొనియాడారు. ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ, అర్హులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూర్చి పేదల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆయన తెచ్చిన పథకాలనే తర్వాతి ప్రభుత్వాలు పేర్లు మార్చి కొనసాగిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. తండ్రిని మించిన తనయుడిగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టించిన ఘనత వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు.

రాజన్న నిను మరువలేం..

భీమవరం పట్టణంలోని గునుపూడిలో వైఎస్సార్ విగ్రహానికి శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, భీమవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ చినమిల్లి వెంకటరాయుడు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కోడి విజయలక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధులు మేడిద జాన్సన్, కామన నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు చీరలు, స్వీట్లు అందజేశారు. వీరవాసరం మండలం నవుడూరులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, కోఆర్డినేటర్ చినవెంకటరాయుడు సీహెచ్‌సీలోని రోగులు, గర్భిణీలు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంచారు.

యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్ ఆధ్వర్యంలో నరసాపురంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని పార్లమెంట్ కన్వీనర్ గూడూరి ఉమాబాల ప్రారంభించారు. శిబిరంలో యువత ఉత్సాహంగా పాల్గొని 87 మంది రక్తదానం చేశారు. తొలుత స్టీమర్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్దకు ఉమాబాల, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ, సందీప్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బందన పూర్ణచంద్రరావు తదితరులు భారీ ర్యాలీగా తరలివెళ్లి నివాళులర్పించారు.

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ జయంతిని వేడుకగా నిర్వహించారు. పట్టణంలోని పోలీస్ ఐల్యాండ్, బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహాల వద్దకు పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీగా వెళ్లి నివాళులర్పించారు.

తణుకులో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీగా పట్టణంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్, వైఎస్సార్ పార్కులోని వైఎస్సార్ విగ్రహాల వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచారు.

పాలకొల్లులో నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, పార్టీ నాయకురాలు గుడాల మంగతాయారు, పార్టీ నేతలు గుణ్ణం నాగబాబు, చెల్లెం ఆనంద ప్రకాష్, యడ్ల తాతాజీ తదితరులు గాంధీబొమ్మల సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ జయంతిని పార్టీ శ్రేణులు వేడుకగా నిర్వహించారు. ఆకివీడు మండలం సిద్ధాపురంలో పండ్లు, రొట్టెలు, చెరుకుమిల్లిలో దుప్పట్లు పంపిణీ చేశారు. కాళ్ల మండలం పెదఅమిరంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెనుమత్స ప్రసాద్‌రాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శివకుమార్, ఆకివీడు జెడ్పీటీసీ వేగేశ్న వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలో మాజీ మంత్రి చెరుకువాడ తనయుడు నరసింహరాజు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఆచంట సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పండ్లు, స్వీట్లు అందజేశారు.



నరసాపురంలో రక్తదాన శిబిరంలో ఉమాబాల, సందీప్ తదితరులు.



వీరవాసరం మండలం నౌడూరు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తదితరులు



కాళ్ల మండలం పెద అమిరంలో పేదలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మహిళ దారుణ హత్య

- భార్య వివాహేతర సంబంధానికి సహకరిస్తోందని ఘాతుకం
- కలిదిండి మండలం గొల్లగూడెంలో ఘటన





ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్, హత్యకు గురైన వరలక్ష్మీదేవి

కలిదిండి(కైకలూరు): భార్య వివాహేతర సంబంధానికి ఎదురింటి మహిళ సహకరిస్తోందనే అనుమానంతో వివాహితను హత్య చేసిన ఘటన కలిదిండి మండలం పోతుమర్రు శివారు గొల్లగూడెంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కట్టా రామాంజనేయులు, కృష్ణవేణి భార్యభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. రామాంజనేయులు చెరువులు సాగు చేస్తున్నాడు. ఇంటి ఎదురుగా నంగెడ్ల వరలక్ష్మీదేవీ(37) భర్తతో కలసి జీవిస్తోంది. ఆమె భర్త ఆటో నడుపుతుంటాడు. గ్రామానికి చెందిన కట్టా నాగమల్లేశ్వరరావు(48) తరుచుగా రామాంజనేయులు ఇంటి వద్దకు వస్తున్నాడు. ఆ సమయంలో ఎదురింటి వరలక్ష్మీదేవితో మాట్లాడేవాడు. రామాంజనేయులు తన భార్య కృష్ణవేణికి నాగమల్లేశ్వరరావుతో వివాహేతర సంబంధం ఉందని, దీనికి మధ్యవర్తిగా వరలక్ష్మీదేవి వ్యవహరిస్తోందని అనుమానించాడు. మంగళవారం మధ్యాహ్నం వరలక్ష్మీదేవి కూలి పనుల నుంచి ఇంటికి వచ్చింది. ఆమె భర్త కుమార్తె టీసీ నిమిత్తం వెంకటాపురం స్కూల్ వద్దకు వెళ్ళాడు. వరలక్ష్మి ఇంట్లో ఒంటరిగా భోజనం చేస్తోంది. ఇదే అదనుగా వెళ్ళి కత్తితో ఆమె మెడపై నరికి రామాంజనేయులు పరారయ్యాడు. ఆమె రక్తపు మడుగులో కొట్టుకుని మరణించింది. కొన్ని గంటలకు భర్త వచ్చి చూసేసరికి అప్పటికే ఆమె మరణించింది. భర్త ఫిర్యాదుపై ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, రూరల్ సర్కిల్, టౌన్ సీఐలు వి.రవికుమార్, పి.కృష్ణ, ఎస్సైలు వెంకటేశ్వరరావు, రాంబాబు, వీరభద్రరావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డీఎస్పీ మాట్లాడుతూ భార్యపై అనుమానం.. ఎదురింటి వరలక్ష్మీదేవి అందుకు సహకరిస్తోందనే హత్యకు పాల్పడినట్లు చెప్పారు. నిందితుడిని త్వరలో పట్టుకుంటామన్నారు. మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కనకాయలంక కాజ్‌వే పరిశీలన



కనకాయలంకలో కాజ్ వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసి రాజు తదితరులు

యలమంచిలి: గోదావరిలో వరద పెరుగుతున్న నేపథ్యంలో కనకాయలంక కాజ్ వే మునిగితే తీసుకోవలసిన రక్షణ చర్యలను పరిశీలించేందుకు మంగళవారం ఆర్డీఓ దాసి రాజు కనకాయలంక వచ్చారు. గ్రామంలో అడ్వాన్స్‌గా నెల రేషన్ సరుకులు నిల్వ ఉంచాలని, కాజ్‌వేను వరద నీరు ముంచితే ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఇంజన్ పడవలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామంలోని తుపాన్ షెల్టర్‌ను పరిశీలించారు. అనంతరం పెదలంక వెళ్లి వరద వస్తే తీసుకోవాల్సిన రక్షణ చర్యలను వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ గ్రంథి నాగ వెంకట పవన్‌కుమార్ వీఆర్వోలు కడిమి ఘనలక్ష్మి, కాకితాపల్లి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మానిటరింగ్ కమిటీకి దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం: షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రజలపై అత్యాచార కేసుల పరిశీలన, నివారణకు నూతన విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ ఏర్పాటుచేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికిగాను ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన ఐదుగురు అనధికార సభ్యులు, స్వచ్ఛంద సంస్థలతో అనుబంధంగా పనిచేస్తున్న ఇతర కులాలకు చెందిన ముగ్గురు సభ్యులను జిల్లా కమిటీకి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, ఎస్సీ, ఎస్టీ తెగల అభివృద్ధికి కృషికి సంబంధించిన ధ్రువపత్రాలతో ఈనెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బాబు మోసాన్ని ఇంటింటికీ వివరించాలి



బ్రోచర్ అందజేస్తున్న మాజీ మంత్రి కారుమూరి

ఇరగవరం: ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఏ ఒక్క హామీ కూడా నేరవేర్చకుండా ప్రజలను దగా చేశారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇరగవరం మండలంలోని కొత్తపాడు గ్రామంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళలను, యువతను, ఉద్యోగులను మోసం చేశారన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలపై క్యూఆర్ కోడ్‌తో కూడిన బ్రోచర్‌ను ఇంటింటికీ అందించాలన్నారు. ప్రజలను మోసం చేయడలో చంద్రబాబును మించిన వారు లేరన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పెన్మెత్స రాంభద్ర రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గారావు, సత్తి వెంకట రెడ్డి, గుడిమెట్ల వీరరెడ్డి, మేట్ల కిరణ్మయి, వీరమల్లు ఫణీంద్ర, కోవ్వూరి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ బొక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పథకంతో లబ్ధి



కుముదవల్లిలో మొక్కలు నాటుతున్న కలెక్టర్

పాలకోడేరు: ఉపాధి హామీ పథకంలో సన్న, చిన్నకారు రైతుల ఆర్థిక అభివృద్ధికి పొలాల్లో పండ్లతోటల పెంపకం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం పాలకోడేరు మండలం కుముదవల్లి పంచాయతీలో కలిదిండి సూర్యనారాయణ రాజు వ్యవసాయ క్షేత్రంలో కొబ్బరి మొక్కలు నాటి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకం ద్వారా సన్న చిన్నకారు రైతులకు ఆదాయాన్ని సమకూర్చాలనే ఆలోచనతో కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రస్తుతం 450 ఎకరాలలో ఉద్యాన తోటల పెంపకాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, ఏపీడి పి.సుజాత, సర్పంచ్ భూపతి రాజు వంశీకృష్ణంరాజు పాల్గొన్నారు.

14 వరకూ పశుగ్రాస వారోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): పశుగణాభివృద్ధితో పాటు మేలు రకం పశుగ్రాసల సాగు ద్వారా అధిక పాల ఉత్పత్తి, పునరుత్పత్తి సామర్థ్యం పెంపుదలకు జూలై 7 నుంచి 14 వరకు పశుగ్రాస వారోత్సవాలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వారోత్సవాలు సందర్భంగా పాడి రైతులకు 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలను అందించనున్నట్లు తెలిపారు. సొంత భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు, చిన్న, సన్నకారు రైతులు 10 సెంట్ల నుంచి 50 సెంట్ల విస్తీర్ణంలో మేలుజాతి పశుగ్రాసాలు పెంచితే ఉపాధి హామీ పథకంలో లబ్ధి చేకూరుతుందన్నారు.

పైసలిస్తేనే మీటర్లు..!

- విద్యుత్ శాఖలో అవినీతి తిమింగలాలు
- అపార్టుమెంట్‌లకు ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్ల మంజూరులో లక్షల్లో చేతులు మారుతున్న వైనం
- డబ్బులివ్వకపోతే మీటర్ల జారీలో కొర్రీలు



తణుకు విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం

తణుకు అర్బన్: తణుకు విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయ సేవలకు అవినీతి మరకలు అంటుతున్నాయి. అత్యవసరంగా అందాల్సిన విద్యుత్ శాఖ సేవలు వినియోగదారులకు కరెంట్ షాకిస్తున్నాయి. సబ్ డివిజన్ పరిధిలోని కిందిస్థాయిలో అవినీతి తిమింగలాల మాదిరిగా ఉన్న కొందరు ఉద్యోగుల తీరుతో వినియోగదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అవినీతికి సంబంధించి జరుగుతున్న పంపకాల్లో తేడాలు ఇటీవల ఆ అవినీతి వ్యవహారాన్ని బయటపెడుతున్నాయి. పైసలిస్తేనే మీటరు అనే స్థాయిలో కొందరు కిందిస్థాయి ఉద్యోగులు వినియోగదారుల నుంచి అందినకాడికి గుంజేసే పరిస్థితి నేడు దాపురించిందని పలువురు వాపోతున్నారు. ఇందుకు ఉదాహరణగానే ఇటీవల డీ 2 సబ్ స్టేషన్‌లో పంపకాల్లో వాటాలు తెగకపోవడంతో ఒకరిపై ఒకరు వాగ్వాదాలు, ఘర్షణలు, దాడులకు పాల్పడుతున్నట్లుగా స్వాక్షాత్తూ విద్యుత్ శాఖ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు.

మీటరు బిగించాలంటే..

మీటరు బిగించాలంటే పైసలివ్వాల్సిందే అనే రీతిలో కొందరు ఉద్యోగులు ఖరాకండిగా తెగేసి చెబుతుండడం వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఎందుకు డబ్బులివ్వాలని నిలదీస్తుంటే ఇంత డబ్బు పెట్టి ఇళ్లు కట్టుకున్నారు కదా మాకు ఇవ్వడానికి చేతులు రావడం లేదా అని నిలదీసే పరిస్థితి తణుకులో దాపురించిందని వినియోగదారులు వాపోతున్నారు. ఏళ్ల తరబడి కిందిస్థాయిలో పాతుకుపోయిన కొందరు ఉద్యోగులు ఇక్కడే తిష్టవేసి జబర్‌దస్త్‌గా అందినకాడికి గుంజేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ఈ విషయంపై తణుకు సబ్ డివిజన్ డీఈఈ బోడపాటి దివాకర్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఇటీవల డీ2 సబ్‌స్టేషన్‌లో జరిగిన గొడవపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించానని, మీటర్లపై డబ్బులు వసూలు చేస్తున్న వ్యవహారం తన దృష్టికి రాలేదని చెప్పారు. తాను గతనెల 27న విధుల్లో చేరానని డబ్బులు డిమాండ్ చేసే వ్యవహారంపై వినియోగదారులు ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బ్యాంక్ కాలనీలో రూ.10 వేలు డిమాండ్

తణుకు బ్యాంక్ కాలనీలో ఒక భవనానికి రెండు మీటర్లు ఇచ్చే క్రమంలో గత నెలలో రూ.10వేలు డిమాండ్ చేసిన అవినీతి భాగోతం ప్రస్తుతం తణుకులో చర్చనీయాంశమైంది. మీటరుకు రూ.5 వేలు చొప్పున రెండు మీటర్లకు రూ. 10 వేలు ఇవ్వాలన్న డిమాండ్‌ను వినియోగదారుడు గట్టిగానే ఎదుర్కొనడంతో మెల్లగా జారుకున్నారు. పైగా ఈ వసూళ్ల పర్వంలో నేను ఒక్కడినే తినేయనని మాపై అధికారులకు కూడా ఇవ్వాలంటూ ఘరానాగా వసూళ్లకు దిగుతుండడం శోచనీయం. అపార్టుమెంట్లలో ట్రాన్స్‌ఫార్మర్లు,, మీటర్లు ఇచ్చే క్రమంలో జరుగుతున్న అవినీతిలో వినియోగదారులు, అధికారుల మధ్య వారధిగా ప్రైవేటు వ్యక్తుల జోక్యం కూడా ఉండడంతో విషయం బయటకు పొక్కకుండా లక్షల్లో దోచేస్తున్న వైనాన్ని విద్యుత్ శాఖ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. సాధారణ ఇంటికి మీటరు బిగించాలంటే రూ.5 వేలు అడుగుతున్నారంటే మేమెక్కడి నుంచి తేవాలంటూ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులివ్వకపోతే ఏదోక కొర్రీలు వేసి మీటర్ల పంపిణీలో జాప్యం చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

మద్ది క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే అర్చకులు స్వామివారికి ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించి, ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బొర్రంపాలెం పీహెచ్‌సీ వైద్యశిబిరం సిబ్బంది ఆలయ ప్రాంగణంలో భక్తులకు వైద్య సేవలు అందించారు. ఏలూరు జిల్లా పంచాయతీ అధికారిణి కె.అనురాధ స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మండపం వద్ద వేదపండితులు, అర్చకులు వేదాశీర్వచనం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం వరకు దేవస్థానమునకు వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,99,207 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు వెయ్యి మంది భక్తులు స్వామివారి నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాదం స్వీకరించారు.

క్లుప్తంగా

మందుల షాపుల్లో విస్తృతంగా తనిఖీలు



జంగారెడ్డిగూడెంలో మందుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్ కంట్రోల్ అధికారులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో మంగళవారం పలు మందుల షాపుల్లో ఔషద నియంత్రణ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి బిల్లులు లేని మందులను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా డ్రగ్ కంట్రోల్ ఏడీ డి.కళ్యాణ చక్రవరి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబిద్ ఆలీ విలేకరులతో మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలో జ్యోతి మెడికల్స్, వాసవీ మెడికల్స్, లక్ష్మీసూర్య గణేష్ మెడికల్ షాపులను సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే లక్ష్మీ శ్రీనివాస మెడికల్స్ షాపులో తనిఖీ చేయగా, షాపు యజమాని కొయ్యలగూడెం షాపునకు బిల్లులు లేకుండా మందులు సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గత నాలుగు రోజులుగా బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. బుట్టాయగూడెంకు చెందిన కె.గణేష్ హైదరాబాద్ నుంచి బిల్లులు లేకుండా గర్భ విచ్ఛిత్తి, వయాగ్రా లాంటి మందులు కొనుగోలు చేసి మోటార్‌సైకిల్‌పై తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో బుట్టాయగూడెంలో లక్ష్మీదుర్గ, కార్తికేయ మెడికల్ షాపులు, కొయ్యలగూడెంలో మురళీకృష్ణ మెడికల్ షాపును సీజ్ చేశామని, వీరికి నోటీసులు జారీ చేసి లైసెన్సులు రద్దు చేస్తామని చెప్పారు. త్వరలో మరికొన్ని మండలాల్లో దాడులు చేస్తామన్నారు. ఇప్పటి వరకు రూ.లక్ష విలువైన మందులను సీజ్ చేశామన్నారు. అలాగే నూజివీడు, ద్వారకాతిరుమల, అత్తిలిలో మూడు మెడికల్ షాపుల లైసెన్సులు రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో తణుకు డీఐ మల్లికార్జున్ పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు



టి.శ్రీనివాస్, పరిశోధనా సహా సంచాలకులు

పెనుమంట్ర: విత్తనోత్పత్తి చేసే రైతులకు మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో దీర్ఘకాలిక రకాలైన బ్రీడర్ సీడ్ అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు పరిశోధనా స్థానాన్ని సందర్శించి వారికి అవసరమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవచ్చని పరిశోధనా సహా సంచాలకులు డాక్టర్ టి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక రకాలైన (150-155 రోజుల పంట కాలం) పీఎల్‌ఏ 1100, స్వల్పకాలిక రకాలైన (120- 125 రోజుల పంట కాలం) ఎంటీయూ 1153, ఎంటీయూ 1156, ఎంటీయూ 1293 బ్రీడర్ విత్తనం 30 కిలోల బస్తాలలో బస్తా రూ.2,334కు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే సన్న గింజ రకమైన 140 రోజుల పంట కాల పరిమితి కలిగిన ఎంటీయూ 1224 రకం ఫౌండేషన్ విత్తనం 25 కిలోల బస్తాల్లో బస్తా రూ.1,175కు 150 రోజుల పంట కాల పరిమితి కలిగిన ఎంటీయూ 1262 రకం బ్రీడర్ విత్తనం రూ.2,334కు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విత్తనాల కోసం పరిశోధనా స్థానం పని దినాల్లో ఉదయం 9 నుంచి సంప్రదించాలన్నారు.

ఏలూరు వేగా జ్యూయలర్స్ లక్కీ డ్రా విజేతలు వీరే



వేగా జ్యూయలర్స్ షోరూంలో లక్కీ డ్రా తీస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేగా జ్యూయలర్స్ గత నెలలో తమ 5వ షోరూంను ఏలూరులో ప్రారంభించిన సందర్భంగా ఖాతాదారులకు అద్భుతమైన ఆఫర్లను ప్రవేశ పెట్టిందని, దానిలో భాగంగా మంగళవారం లక్కీడ్రాను ఖాతాదారుల సమక్షంలో నిర్వహించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. లక్కీ డ్రాలో గెలుపొందిన అయిదుగురికి ఒక్కొక్కరికి రూ. 2 లక్షల విలువైన డైమండ్ నెక్లెస్‌ను యాజమాన్యం అందజేసినట్లు చెప్పారు. లక్కీ డ్రా విజేతలుగా టీ ఆరుణశ్రీ (గన్ బజార్, ఏలూరు), ఏ.శారదా దేవి (హనుమాన్ జంక్షన్), (వీ.రాంబాబు, ఏలూరు), గండికోట నాగలక్ష్మి (ఏలూరు), టీ.శత్రుఘ్నకుమార్ (పవర్ పేట, ఏలూరు) నిలిచారన్నారు. లక్కీ డ్రా సందర్భంగా విజేతలకు వేగా జ్యూయలర్స్ చైర్మన్ బండ్లమూడి రామ్మోహన్, మేనేజింగ్ డైరెక్టర్ వనమా నవీన్ కుమార్, డైరెక్టర్లు వనమా సుధాకర్, చిట్లూరి నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారుల కోరిక మేరకు ప్రస్తుతం అందిస్తున్న ఆఫర్లు కొనసాగిస్తున్నామని రూ.లక్ష కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం, పాత బంగారం మార్పిడిపై గ్రాముకు రూ.100 అదనంగా చెల్లించటం, డైమండ్ ధర క్యారెట్‌కు రూ.51,999 మాత్రమే అని తెలిపారు. ఈ ఆఫర్లు ఏలూరు షోరూమ్‌లో ఈ నెల 25 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు.

అన్నదాత సుఖీభవ అర్హతను పోర్టల్‌లో చూసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు



దువ్వలో యాంత్రీకరణ ద్వారా నాట్లు వేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హత వివరాలపై పోర్టల్ వెబ్ సైట్‌లో చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం తణుకు మండలం దువ్వలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన రైతులకు అనర్హత వస్తే తమ అర్హతకు సంబంధించిన పత్రాలను గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి గ్రీవెన్స్ పోర్టల్‌లో ఈనెల 12వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని ప్రస్తుతం 44,792 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాలోని ప్రైవేటు, మార్క్‌ఫెడ్స్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువల కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దువ్వ గ్రామంలో 3,530 ఎకరాలు వరి సాగు చేస్తున్నారని దీనిలో సుమారు 40 శాతం మిషన్ ద్వారా నాట్లు వేస్తున్నారని ఇది చాలా శుభ పరిణామం అన్నారు.

త్వరలో ధాన్యం డబ్బులు

రైతులు గత సీజన్‌కు సంబంధించిన మిగిలిన ధాన్యం డబ్బులు రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో రైతుల ఖాతాలకు జమవుతాయని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు తెలియజేశారు. దువ్వ గ్రామానికి చెందిన కొందరు రైతులు గత సీజన్లో ట్రాక్టర్లు, లారీల ద్వారా రైస్ మిల్లులకు రైతుల ధాన్యాన్ని చేరవేశామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు మాకు రవాణా సొమ్ము అందలేదని అడగ్గా, ఈ సమస్యను సివిల్ సప్లయి విభాగ దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం యాంత్రీకరణ ద్వారా రైతులు నాట్లు చేస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తణుకు ఎంపీపీ రుద్రా ధనరాజు, తణుకు వ్యవసాయ సహాయ సంచాలకులు జి నరేంద్ర, డీఆర్‌సీ వ్యవసాయ అధికారిణి జి. బాల నాగేశ్వరమ్మ, మండల వ్యవసాయ అధికారి కే రాజేంద్రప్రసాద్, దువ్వ పీఏసీఎస్ సెక్రటరీ కిరణ్ వీఏఏలు మల్లికార్జున్, అరుణ్, పుష్ప, ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతో కేసుల సత్వర పరిష్కారం



మధ్యవర్తుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు (టూటౌన్): మధ్యవర్తులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని శిక్షణ పొందిన మధ్యవర్తులతో ఒకరోజు దిశా నిర్దేశ (ఓరియంటేషన్) కార్యక్రమాన్ని ఏలూరు బార్ అసోసియేషన్ హాలు నందు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి మాట్లాడుతూ గౌరవ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మధ్యవర్తిత్వము ద్వారా కేసుల పరిష్కారానికి 90 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, అందుకు శిక్షణ పొందిన మధ్యవర్తులకు నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఒక రోజు దిశా నిర్దేశ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కక్షిదారులకు త్వరితగతిన న్యాయ పరిష్కారం అందించే దిశగా అందరూ కృషి చేయాలని కోరారు. రెండవ అదనపు జిల్లా జడ్జి యు ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ ఇరు పార్టీలను సమన్వయం చేసి మధ్యవర్తిత్వం నిర్వహించడం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్ ప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనె సీతారాం, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రిసోర్స్ పర్సన్ సుదర్శన సుందర్, విజయ కమల, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

కైకలూరు: నిద్రిస్తున్న మహిళను పాము కాటు వేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. కై కలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరహాపట్నం గ్రామానికి చెందిన కత్తుల కౌశల్య(38) కుమార్తె, కుమారుడితో కలిసి సోమవారం రాత్రి ఇంటి లోపల నిద్రించగా భర్త గొల్లబాబు ఆరుబయట పడుకున్నాడు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఏదో కుట్టిందని కౌశల్య చెప్పడంతో గ్రామంలో నాటు వైద్యుని దగ్గరకు తీసుకెళ్లారు. అక్కడ నుంచి ఆటోలో కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె అదే రాత్రి మృతి చెందింది. కాటు వేసిన కోడె నాగపాము ఇంటిలో రాయి కింద నక్కి బుసలు కొట్టడంతో గ్రామస్తులు మంగళవారం కొట్టి చంపారు. తల్లిని కోల్పోవడంతో బిడ్డలు కన్నీరుమున్నీరుగా రోదించారు. ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భర్త ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగ్గురికి చికిత్స

పోలవరం రూరల్: మండలంలో ముగ్గురు పాము కాటుకు గురై పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. చేగొండిపల్లి, ప్రగడపల్లి, కొత్తపట్టిసీమ గ్రామాల్లో ముగ్గురు వ్యవసాయ కూలీలు పొలంలో పనిచేస్తుండగా, మంగళవారం పాముకాటుకు గురయ్యారు. వీరిని వెంటనే పోలవరం వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యాధికారి కృష్ణంరాజు వీరికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగా ఉందన్నారు. వర్షాకాలం సీజన్‌లో ప్రతి ఒక్కరూ విషకీటకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

బెల్టు షాపు నిర్వాహకురాలి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: నవాబుపాలెంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న ఒక మహిళను అరెస్ట్ చేసి, ఆమె నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. అలాగే ఇద్దరు బెల్టు షాపు నిర్వాహకులను మండల మేజిస్ట్రేట్ కోర్టులో బైండోవర్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో గండికోట నవీన్ మృతదేహం

కామవరపుకోట: స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన తడికలపూడిలో జరిగింది. ఎస్సై చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు మండలం జాలిపూడి గ్రామానికి చెందిన గండికోట నవీన్ (40) గండిగూడెం గ్రామంలో పదేళ్ల నుంచి వ్యవసాయ పనులు చేసుకుంటూ అత్తవారింటిలో ఉన్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సొంతూరు జాలిపూడి వెళ్లే నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా తడికలపూడి గ్రామంలో శ్రీనివాస వే బ్రిడ్జి దగ్గరకు వచ్చేసరికి ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. దీంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. నవీన్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, నవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్లు ఎస్సై చెన్నారావు తెలిపారు.

11న ఏలూరులో ఉద్యోగ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధి, శిక్షణ శాఖ, ఏలూరు, నేషనల్ కేరియర్ సర్వీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వీ.వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్‌లో టెలీపర్‌ఫార్మెన్స్ ఇండియా, భారతి ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్, ఎంసీసీ ఏలూరు సంస్థ పాల్గొంటున్నాయన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 88868 82032లో సంప్రదించాలని కోరారు.

కొబ్బరి ధర అదుర్స్



కొబ్బరి బొండాలు

దెందులూరు: గత నాలుగైదేళ్లుగా సరైన ధర లేక నిరాశ చెందిన కొబ్బరి రైతులకు ఈ ఏడాది పంట పండింది. కొబ్బరి బొండాలకు మంచి ధర పలకడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 33 వేల ఎకరాల్లో కొబ్బరి తోటల సాగు జరుగుతుండగా దిగుబడిలో 60 శాతాన్ని హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తారు. మిగిలిన 40 శాతం దిగుబడిన దేవాలయాలకు, తాగడానికి ఉపయోగిస్తున్నారు. ఒక ఎకరానికి రూ.50 వేలు నుంచి రూ.60 వేలు సాగు ఖర్చు అవుతుండగా 9 వేల కొబ్బరికాయలు దిగుబడి లభిస్తుంది. ఈ ఏడాది కొబ్బరికాయ ధర రూ.17 పలకడంతో కొబ్బరి రైతులు లాభాలను చూస్తున్నారు. దీనికితోడు వారు అంతర పంటలు సాగు చేస్తున్నారు. కొబ్బరిలో అంతరపంటలుగా కోకో తోటలు, మిరియాలు, జాజీ సాగు చేసి అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. అలాగే ఈ ఏడాది చీడపీడల వ్యాధుల ప్రభావం కూడా లేకపోవడం రైతులకు కలిసివచ్చింది. జిల్లాలో 200 ఎకరాల్లో మిరియాలు, 36 వేల ఎకరాల్లో కోకో, జాజి 15 ఎకరాల్లో అంతర పంటలుగా రైతులు పండిస్తున్నారు.

కోకో నట్ ఫారం రైతులకు వరం

కొబ్బరి విస్తరణ పథకంలో భాగంగా పెదవేగి మండలం వేగివాడలో కేంద్ర ప్రభుత్వం కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోకోనట్ ఫారం కొబ్బరి రైతులకు వరంగా మారింది. ఈ ఫారంలో కొబ్బరి సాగుకు అనువైన ఈస్ట్ కోస్ట్, వెస్ట్ కోస్ట్, మల్కన్ గ్రీన్ చౌగాన్ ఆరెంజ్ వంటి రకాల మొక్కలను రైతులకు నిర్ణీత ధరకు విక్రయిస్తున్నారు. మొక్కలను బయట కొనుగోలు చేసి ఈ ఫారంలో బిల్లు చూపించి ఆయా గ్రామాల్లో రైతు సేవ కేంద్రంలో నమోదు చేసుకున్న 50 శాతం రాయితీ ఇస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే మరిన్ని లాభాలు



జిల్లాలో కొబ్బరి తోటల సాగు లాభదాయకంగా ఉంది. గత నాలుగైదేళ్లుగా పోలిస్తే ఈ ఏడాది సంతృప్తికరమైన దిగుబడులు వచ్చి మంచి ధర కూడా పలకడంతో లాభాలను ఇచ్చింది. రైతులు ఉద్యానవన శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మరిన్ని లాభాలు సాధించవచ్చు.

– మోహనరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

తడి బట్టలు ఆరేస్తూ విద్యుత్ షాక్‌తో మృతి



గంగ మృతదేహం

కైకలూరు: ఉతికిన తడి బట్టలు దండెంపై ఆరేస్తుండగా ఇనుప రాడ్డుకు తాకి విద్యుదాఘాతానికి గురై వివాహిత మృతి చెందిన ఘటన పెంచికలమర్రు గ్రామంలో సోమవారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెంచికలమర్రుకు చెందిన జయమంగళ చిన సుబ్బరావు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య గంగ(50) గృహిణి. మంగళవారం ఇంటి దగ్గర ఉతికిన తడి బట్టలు దండెంపై ఆరేస్తుండగా సమీపంలో ఉన్న ఇనుప రాడ్డుకు ఉన్న మెయిన్ వైరు కారణంగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు గంగ మృతదేహానికి మంగళవారం పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 81422 37635 [B-2639]

Wanted

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9640400073, 9160900024 [SCA25005931]

■ ఏలూరు / భీమవరం ఏరియాలో ఫీల్డ్ వర్క్ చేయుటకు డిగ్రీ హోల్డర్ కావలెను. టూ-వీలర్ ఉండవలెను. Send to Resume. Ph: 95057 99599 [SCA25006077]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకొవ దానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP& డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం. Hyd.9014885406 [HA-15968]

■ Required Field Executives for Electronic Goods Procurement from stores. Ph.No: 9133399257, 9703333378 [G-145]

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9963521122, 9963101122 [B-1275585]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు: పేరు: శ్రీ. వై. శ్రీకాంత్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 80994 44378, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు: 79951 98451.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6) / రూల్ 9(1) కు నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖాచేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే దిగువ సంతకందారు లాంఛనంగా స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖా పెట్టిన ఆస్తి/ఆస్తుల ఇ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీతలు : 1) M/s శ్రీ పద్మజ ట్రేడర్స్, ప్రొప్రయిటర్: శ్రీ ఇంటి వీర వెంకట నాగ రాజు, తండ్రి : వీర వెంకట సత్యనారాయణ, డోర్ నెం. 1-24, రిలయన్స్ పెట్రోల్ బంక్ ప్రక్కన, మెయిన్ రోడ్, ఆకివీడు, పశ్చిమ గోదావరి జిల్లా-534235. 2) శ్రీ ఇంటి వీర వెంకట నాగరాజు, తండ్రి : వీర వెంకట సత్యనారాయణ, (M/s శ్రీ పద్మజ ట్రేడర్స్ యొక్క ప్రొప్రయిటర్), డోర్ నెం.18-13/4, శేషయ్య వీధి, వెస్ట్ రైల్వే గేట్, ఆకివీడు, పశ్చిమ గోదావరి జిల్లా-534235. 3) శ్రీ ఇంటి వీర వెంకట నాగరాజు, తండ్రి : వీర వెంకట సత్యనారాయణ, డోర్ నెం.18-13/4, శేషయ్య వీధి, వెస్ట్ రైల్వే గేట్, ఆకివీడు, పశ్చిమ గోదావరి జిల్లా-534235. 4) శ్రీ ఇంటి వీర వెంకట సత్యనారాయణ, తండ్రి: వెంకట స్వామి, డోర్ నెం.18-13/4, శేషయ్య వీధి, వెస్ట్ రైల్వే గేట్, ఆకివీడు, పశ్చిమ గోదావరి జిల్లా-534235. డిమాండ్ నోటీసు తేది: 31.01.2024, ప్రస్తుత బకాయి మొత్తం: తేది 05.07.2025 నాటికి రూ. 56,08,588/- + తేది 06.07.2025 నుండి భవిష్య వడ్డీ మరియు అన్ని ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి.

స్థిరాస్తుల వివరములు

ఆస్తి నెం.1 : పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు ఎస్ఆర్‌ఓ, ఆకివీడు మండలం, దుంపగడప గ్రామం & పంచాయితీ వద్ద నమోద డోర్ నెం.1-9, ఆర్.ఎస్ నెం.84/16, ప్లాట్ నెం.బి-5 నందు 225.6 చ॥గ॥లు విస్తీర్ణంలోని ఖాళీ స్థలం రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.390/2016, తేది.16.02.2016 & రిజిస్టర్డ్ రెక్టిఫికేషన్ డీడ్ డాక్యుమెంట్ నెం.2087/2017, తేది.26.07.2017 ప్రకారం శ్రీ ఇంటి వీర వెంకట నాగరాజు, తండ్రి : వీర వెంకట సత్యనారాయణ గారికి చెందినది. హద్దులు : ఉత్తరం : రుద్రరాజు రవి వర్మ గారికి చెందిన ప్లాట్ నెం.బి4, దక్షిణం : ప్లాట్ నెం.బి6, తూర్పు : 18 అ॥ల వెడల్పు ఉమ్మడి దారి, పడమర : ప్లాట్ నెం.సి5.

రిజర్వు ధర : రూ.9,57,000/- ధరావత్తు : రూ.95,700/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఆస్తి నెం.2 : పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు ఎస్ఆర్‌ఓ, ఆకివీడు మండలం, ఆకివీడు గ్రామం & పంచాయితీ ఏరియా వద్ద నమోద డోర్ నెం.18-45, ఆర్.ఎస్ నెం.299/1 నందు మొత్తం విస్తీర్ణం 254 చ॥గ॥లలోని ఉత్తరం వైపున విస్తీర్ణం 158 చ॥గ॥లలోని (రోడ్డు విస్తరణ తరువాత నికర స్థలం విస్తీర్ణం 130 చ॥గ॥లు) ఖాళీ స్థలం రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 437/2012, తేది.14.02.2012 ప్రకారం శ్రీ ఇంటి వీర వెంకట సత్యనారాయణ, తండ్రి : వెంకట స్వామి గారికి చెందినది. హద్దులు : ఉత్తరం : వంట బోధి, దక్షిణం : కొలిశెట్టి పేరయ్య గారికి చెందిన స్థలం, తూర్పు : 5 లింకుల వెడల్పు ఉమ్మడి దారి, పడమర : వారువల్లి సుబ్బారావు & ఇతరులకు చెందిన స్థలం.

రిజర్వు ధర : రూ.8,00,000/- ధరావత్తు : రూ.80,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఆస్తి నెం.3 : పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు సబ్ రిజిస్ట్రార్, ఆకివీడు మండలం, ఎస్ఆర్‌ఓ, ఆకివీడు గ్రామం & మేజర్ పంచాయితీ వద్ద గల నమోద డోర్ నెం.18-38, ఆర్.ఎస్ నెం.291/2 నందు 230 చ॥గ॥లు విస్తీర్ణం లోని ఖాళీ స్థలం రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.1079/2013, తేది.04.04.2013 ప్రకారం శ్రీ ఇంటి వీర వెంకట సత్యనారాయణ, తండ్రి : వెంకట స్వామి గారికి చెందినది. హద్దులు : ఉత్తరం : గండికోట వెంకన్న, ఇ. వెంకటేశ్వర్లు, ఇ.పెద్దులు & ఇతరులకు చెందిన స్థలం, దక్షిణం : కట్టా సత్యనారాయణ గారి స్థలం, తూర్పు : 5 లింకుల వెడల్పు ఉమ్మడి దారి, పడమర : వారువల్లి బాబూరావు & ఇతరులకు చెందిన స్థలం. తెలిసిన ఋణభారములు : ఏమీ లేవు.

రిజర్వు ధర : రూ.12,00,000/- ధరావత్తు : రూ.1,20,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేది : 28-07-2025 సమయం: ఉ॥ 11:00 గం.ల నుండి సా॥ 04.00 గం.ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది 09-07-2025 నుండి తేది 25-07-2025 వరకు ఉ॥ 10.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు :

(1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్: www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices లో ఏర్పాటు చేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇ.ఎమ్.డి. వేలం వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ మెసర్స్ పిఎస్‌బి అలయన్స్ ఇ-వేలం పోర్టల్: https://baanknet.com/eauction-psb/bidder-registration & https://www.baanknet.com మరియు టోల్ ఫ్రీ నెంబర్లు +91 - 8291220220, మెయిల్ ఐడి: support.baanknet@psballiance.com ను సంప్రదించండి.

(2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు / అదనపు స్టాంపు డ్యూటీ / బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మొదలగునవి మరియు చట్టపరమైన / నాన్ స్టేట్యూటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలుదారే భరించవలెను.

గమనిక-1: ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు పిఎస్‌బి అలయన్స్ నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి. మొత్తం మెసర్స్ పిఎస్‌బి అలయన్స్ బ్యాంక్ అకౌంట్లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరచిన తరువాత మాత్రమే బిడ్డర్ యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో అది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి.ను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించడమైనది.

గమనిక-2: ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ. 50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు అమ్మకం ధరలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం. 16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంక్ వారికి సమర్పించవలెను. (వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది: 05.07.2025. ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్లుప్తంగా

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



కార్మికులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం రూరల్: దేశ వ్యాప్తంగా ఈ నెల 9వ తేదిన జరగనున్న సార్వత్రి క సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నీ్రాదిపురం గ్రామంలో పని ప్రదేశంలో కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. కార్మికహక్కులు, చట్టాలరక్షణకై కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొనాలన్నారు. లేబర్ కోడ్ రద్దుచేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణ విధానాలు విరమించాలని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకుడు దిద్దే నాగేశ్వరరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో ఈ నెల 10వ తేదీన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో భాగంగా ప్రతి తల్లికి ఒక మొక్క నాటించే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ద్వారా 18,800 మొక్కలు కేటాయించారు. కడకట్ల ఉన్నత పాఠశాలకు మంగళవారం మొక్కలు చేరాయి. ఎంఈఓ-2 పీఎంకే జ్యోతి ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కళాకారుల సంఘం అధ్యక్షుడిగా షేక్ నాగూర్ సాహెబ్



నూతన కార్యవర్గం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా షేక్ నాగూర్ సాహెబ్ ఎన్నికయ్యారు. స్థానిక వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో సూరంపూడి వెంకట రమణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఉపాధ్యక్షుడిగా జి.శరత్‌బాబు, కూచి వెంకట నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, కోశాధికారిగా ఏలూరి జగదీష్, కార్యదర్శులుగా జెకె కృష్ణ, మిరియాల రవిబాబు, మహిళా అధ్యక్షురాలుగా కవురు శారదలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కొల్లి రమావతి, సీరా కొండలరావు, షేక్ ఖాసిం సాహెబ్, మాసా బాబురావులు మాట్లాడారు. కవి బండారు జ్ఞానన ప్రసాద్‌చే సంఘం శాశ్వత నిధికి రూ.5 వేలు వితరణ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక, దత్తాత్రేయ హోమాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో అషాఢ శుద్ధ త్రయోదశి, మంగళవారం సందర్భంగా వినాయక, దత్తాత్రేయ హోమాలు జరిగాయి. వేద పండితులు మర్ల సూర్యనారాయణ శర్మ, ఆలయ అర్చకులు ఇవటూరి శశికాంత్ శర్మలచే విశేష పూజలు నిర్వహించారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

తణుకులో ఏబీవీపీ ర్యాలీ



తణుకులో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ నిర్వహించిన దృశ్యం

తణుకు అర్బన్: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) స్థాపించి ఈనెల 9వ తేదీకి 77 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా మంగళవారం తణుకులో వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల సమస్యలపై ఏళ్ల తరబడి ఏబీవీపీ తరఫున వివిధ పోరాటాలు చేసినట్లుగా ఏబీవీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబరు మానూరు సత్యనారాయణ తెలిపారు. అనంతరం తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ తణుకు పట్టణ కార్యదర్శి చిట్టూరి పవన్ కుమార్, సభ్యులు మల్లుల భాను ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో బీజేపీ నాయకులు, మునిసిపల్ మాజీ చైర్పర్సన్ ముళ్లపూడి రేణుక, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, జనసేన పట్టణ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి శ్రీనివాస్, కొడమంచిలి జితేంద్ర పాల్గొన్నారు.

పేదల గుండెచప్పుడు వైఎస్సార్



మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకులో వైఎస్సార్ పుట్టినరోజు వేడుకల్లో మాజీ మంత్రి కారుమూరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు

- విద్యాదాత, ఆరోగ్య ప్రదాతగా వైఎస్సార్
- తణుకు, తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో మాజీ మంత్రులు కొట్టు, కారుమూరి

తణుకు అర్బన్: విద్యాదాత, ఆరోగ్య ప్రదాతగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో పదిలంగా గూడుకట్టుకున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా మంగళవారం తణుకులో వైఎస్సార్ విగ్రహాలకు కారుమూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందజేసిన మహనీయుడు వైఎస్సార్ అని తెలిపారు. పేద వర్గాల్లోకూడా డాక్టర్లు, ఇంజనీర్లుఅయితే ఆయా కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడతాయని ఫీజురీయింబర్స్‌మెంట్ పథకంద్వారా ఉన్నత విద్యను పేదలక చేరువచేసి విద్యా దాతగా పేదల ఇంట కొలువుతీరారని స్పష్టం చేశారు. తణుకు ప్రాంతంలో ఇందిరమ్మ కాలనీ పేరుతో పేదలకు ఇళ్లు అందించిన ఘతన వైఎస్సార్‌కు దక్కుతుందన్నారు. అనంతరం పార్టీశ్రేణుల సమక్షంలో కేకు కట్‌చేసి మిఠాయిలు పంచారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని వైఎస్సార్ పార్కులో డాక్టర్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, పబ్లిసిటీవింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి, నాయకులు నత్తా కృష్ణవేణి, పైబోయిన ఏసుబాబు, ఝాన్సీ లారెన్స్, గెద్దాడ శ్రీకాంత్, కోట నాగేశ్వరరావు, సరెళ్ల వీరతాత, ముళ్లపూడి బాబూరావు, బిరుదుకోట చింతన్న, సాక్షి గోపాలరావు, పుల్లెపు సూర్యచంద్రరావు, కోట స్వామీజీ, కొమ్మోజు రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ దేశానికే ఆదర్శనీయుడు

తాడేపల్లిగూడెం అర్బన్ : మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలన అందించి దేశానికి ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద, ఆర్టీసీ డిపో వద్ద వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ఆరోగ్యశ్రీ, 108 వంటి సదుపాయాలను పేదలకు చేరువ చేశారన్నారు. లక్షల ఖర్చుతో కూడిన వైద్యసేవలను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితం అందజేసిన భగవంతుడిగా ప్రజలు కొనియాడుతున్నారన్నారు. 108 వంటి సంక్షేమ పథకాలను మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం చేతుల మీదుగా ప్రారంభించిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందన్నారు. తండ్రి అడుగు జాడల్లోనే కుమారుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశానికే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. విద్య, వైద్యంతో పాటు ఎవరూ ఊహించని విధంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేసి ప్రజల మనసుల్లో నిలిచిపోయారన్నారు. ప్రస్తుత ప్రజాప్రతినిధులు అక్రమాలకు, అవినీతి పాలన అందిస్తున్నారని ఆరోపించారు. అనంతరం పేదలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, జిడ్డు హరిబాబు, రెడ్డి సూరిబాబు, దాసి బాబు, సూర్పన రామకృష్ణ, చిటికన ప్రసాద్, బొద్దాని శ్రీనివాస్, నీలం భూషణం, చామన సూర్యచంద్రరావు, భాసరరెడ్డి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతవ్యక్తి వైఎస్సార్

అత్తిలి: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలను మంగళవారం అత్తిలిలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ దివంగత మహానేత రాజశేఖరరెడ్డి హయాంలో పేద ప్రజల అభ్యున్నతికి ఎన్నో వినూత్నమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్ ఆశయ సాధనకు ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందకు వేసి ప్రజలకు సంక్షేమ పాలన అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, పార్టీనాయకులు పోలినాటి చంద్రరావు, దారం శిరీషా, సబ్బితి రాజేష్, కోరుకొల్లు వెంకట్రావు, కంకటాల సతీష్, బుడితి సుజన్‌కుమార్, గర్నిపూడి సర్వేశ్వరరావు, రామిశెట్టి రాము, బుంగా పద్మారావు, రాయుడు ధర్మారావు, రాపండు, పంపన బుజ్జి, బొంతా యశోద, కాసగాని చిన్నా, యాళ్ల సాధుసుందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళులు

తణుకు అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా లేకపోయినా ఆయన చేసిన మంచి పేదవర్గా గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయిందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా తణుకు మండలం తేతలి గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ విద్య, వైద్య విధానాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పేదలకు అండగా నిలబడ్డారని అన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై వైఎస్సార్ విగ్రహానికి కారుమూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, పేరిచర్ల సతీష్‌రాజు, సరెళ్ల వీరతాత, దారం శ్రీను, దొంగ భీమచంద్రరావు, వలవల కిషోర్, మానేపల్లి సంపతరావు తదితరులు పాల్గొన్నారు.

దువ్వలో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకను తణుకు మండలం దువ్వ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వైఎస్సార్ విగ్రహాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రుద్రా ధనరాజు మాట్లాడుతూ పేదలపాలిట ఆపద్బాంధవుడిగా వైఎస్సార్ పరిపాలన అందజేశారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దువ్వ సర్పంచ్ అడ్డా బాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు శిరిగిశెట్టి గోపాలకృష్ణ, దండు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్సార్

తాడేపల్లిగూడెం రూరల్: అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామంలో దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రైతు, డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ వంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.



మాధవరం గ్రామంలో చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు

అనంతరం బంగారుగూడెం, మెట్ట ఉప్పరగూడెం, కొమ్ముగూడెం, ఉప్పరగూడెం, ఎల్. అగ్రహారం, కొండ్రుప్రోలు గ్రామాల్లో వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపలి భద్రరావు, బండారు నాయక్, రాపాక గోపీ, తమ్మిశెట్టి రఘు, గోపిశెట్టి దొరబాబు, గాలి శ్రీను, పెద్దిరాజు, తారమట్ల శ్రీనివాస్, ప్రత్తి రాజబాబు పాల్గొన్నారు. అలాగే, పడాల మార్కెట్ యార్డులో ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ గుండుబోగుల వెంకటరమణ - నాగు దంపతులు చీరలు పంపిణీ చేశారు. ఆరుగొలనులో సబ్బితి బ్రహ్మయ్య, ఎమ్పీటీసీ నార్ని శంకరరావు, దండగర్రలో ములగాల గంగారావు, సత్తినీడి కొండయ్య, మాధవరంలో రాపాక వెంకటేశ్వరరావు, కుంచనపల్లిలో తాడేపల్లి మోషే, జగన్నాథపురంలో ముప్పిడి లక్ష్మణరావు, ముళ్లపూడి రామకృష్ణ, పుల్లాయగూడెంలో శనగన సత్యనారాయణ, వీరంపాలెంలో ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు), మాకిరెడ్డి గాంధీరెడ్డి, అఖిల్ రెడ్డి, రెడ్డి వెంకటకృష్ణ, రెడ్డి బ్రహ్మానందరెడ్డి, ముప్పిడి బ్రహ్మానందరెడ్డి, బంగారుగూడెంలో ఎమ్పీటీసీ బుర్ల సుబ్బలక్ష్మి, బొడ్డు రామచంద్రరావు, నున్నా గెరటరాజు, పులి సత్యనారాయణ, బుర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో..

పెంటపాడు: మండలంలో మంగళవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు గ్రామాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పెంటపాడులో జరిగిన కార్యక్రమంలో కడప జిల్లాకు చెందిన రాష్ట్ర రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు యరపరెడ్డి సురేంద్ర రెడ్డి, రాష్ట్ర మహిళా కో ఆర్డినేటర్ యర్రగుంట్ల పద్మప్రియారెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ చిర్ల వీవీఎస్ఎస్ రెడ్డి తదతరులు పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి అంజిరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతంశెట్టి లక్ష్మి, కార్యదర్శి కర్రి సురేష్‌రెడ్డి, నల్లమిల్లి గాంధీరెడ్డి, వైఎస్సార్ అభిమానులు గాడె సాయిరాం, చిర్ల సుభాష్‌రెడ్డి, వెలగల దానిరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, పాణ్యం శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దువ్వలో వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న ఎంపీపీ ధనరాజు, పార్టీ నాయకులు



అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మండల వైఎస్సార్ సీపీ నాయకులు



పెంటపాడులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయరాదని, సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని విజయవాడకు చెందిన డాన్ బాస్కో నవజీవన బాల భవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల క్లస్టర్ కోఆర్డినేటర్ శ్రీ తేజ పేర్కొన్నారు. మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి సైబర్ నేరాలు, వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన డిజిటల్ పౌరులుగా ఉండేందుకు, సైబర్ నేరాలపై వివిధరకాలుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న ప్రస్తుత కాలంలో వాటిబారిన పడకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ కేటుగాళ్లు లక్కీ డ్రా, ఉచిత రీఛార్జ్, గిఫ్ట్ కూపన్లు వంటి ఉచిత డబ్బును పొందే మార్గాలను ఆశ చూపి, మన బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును కొల్ల గొడుతున్నారన్నారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి, నేరం జరిగిన గంటలోపే 1930 నంబరుకు ఫోన్‌చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పృధ్వీరాజ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఎన్జీవో కాలనీవాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పలువురు సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మునిసిపల్ కార్యాలయం వద్ద పనిముట్లతో నిరసన ప్రదర్శన జరిగింది. మునిసిపల్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. అబ్కాస్ విధానాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఎనిమిది గంటల పనిదినాలు అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు వారి నైపుణ్యాలు తగ్గట్టుగా జీతాలు పెంచాలని తెలిపారు. చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకించారు. ఈ నెల 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొనాలని కోరారు. అనంతరం పోలీస్ ఐలాండ్ వరకు ర్యాలీ జరిగింది. నిరసనలో ధనాల వెంకట్రావు, ఏబీ శ్రీనివాస్, తాడికొండ జయరాం కృష్ణ, కె.బాబు, తాడికొండ శ్రీను, దయామణి, అల్లం పూర్ణిమ, భాను తదితరులు నాయకత్వం వహించారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయం వద్ద పనిముట్లుతో నిరసన తెలియజేస్తున్న దృశ్యం

డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

తణుకు అర్బన్: దివ్యాంగులకు అండగా నిలబడి ఉపాధి కల్పించే విధంగా సహకారం అందిస్తున్న డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ బొల్లా సేవలు ఎనలేనివని దివ్యాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేంద్ర లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక తణుకు ఇండియన్ పబ్లిక్ స్కూల్ ప్రాంతంలో దివ్యాంగులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ దివ్యాంగులకు ఎటువంటి ప్రోత్సాహంలేని రోజుల్లో డబ్బు రూపంలో బాండ్లు, వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారని, ఇటీవల కాలంలో దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా ఉపాధి పొందాలనే ఉద్దేశ్యంతో ఉచితంగా దుకాణాలను ఏర్పాటు చేసి సరుకులను అందుబాటులోకి తీసుకువస్తున్నారని వారికి దివ్యాంగులంతా రుణపడి ఉంటామని అన్నారు. సతీష్‌కుమార్ మాట్లాడుతూ నా స్నేహితుడు డాక్టర్ కిరణ్‌తో కలిసి దివ్యాంగులకు ఎన్నో సేవలందించామన్నారు. డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ ఫౌండేషన్‌ను స్థాపించి దాతల సహకారంతో దివ్యాంగులకు వసతులు కల్పిస్తున్నట్లుగా చెప్పా రు. కార్యదర్శి మానేపల్లి కాశీ విశ్వనాథం, తణుకు జగదీష్, దివ్యాంగులు పాల్గొన్నారు.



తణుకులో దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ చేస్తున్న సతీష్‌కుమార్

జిల్లా యోగాసన పోటీలను విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారత ప్రభుత్వ క్రీడల మంత్రిత్వశాఖ, యోగాసన భారత్ వారి సహకారంతో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఆదివారం జిల్లా యోగాసనా పోటీలు భీమవరం బైపాస్ రోడ్డు భాష్యం స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రతినిధులు గౌరవ అధ్యక్షుడు కరిబండి రామకృష్ణ, అధ్యక్షుడు వింజుమూరి మాధవరావు, ఉపాధ్యక్షుడు కట్టుంగ రామచక్రధర్‌రావులు వెల్లడించారు. పంతంజలి యోగాలయంలో జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పోటీలు 10 సంవత్సరాలు నుంచి 14 వరకు, 14 నుంచి 18 వరకు, 18 నుంచి 28 వరకు, 28 నుంచి 35 వరకు 35 నుంచి 45 వరకు, 45 నుంచి 55 సంవత్సరాలు వరకు వివిధ కేటగిరిలలో యోగాసనా పోటీలు జరుగుతాయని చెప్పారు. ఆరు విభాగాల్లో బాలురు, బాలికలు పాల్గొనవచ్చునని, ప్రపంచ యోగాసన, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ వారిచ్చిన సిలబస్ ప్రకారం ట్రెడిషనల్ యోగా, రిథమిక్ యోగా, ఆర్టిస్టిక్ యోగా, 12 రకాల కాంపిటీషన్స్ జరగనున్నాయని చెప్పారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు వెల్లడించారు. పై స్థాయిలో గెలుపొందిన వారికి ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యం కలదని వివరించారు. సహ కార్యదర్శి చిక్కాల అంబిక, కోశాధికారి ఉప్పలపాటి వెంకటేశ్వర రాజు, సభ్యులు బాకా వెకంటేశ్వరరావు, కారుమూరి పార్వతి, తోట అరుణ, దత్తాత్రేయ శర్మ, అపర్ణ ప్రసాద్, అల్లు రామకృష్ణ, కుంట్ల రామ్మోహన్‌రావు, అల్లు సుభాషిని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో యోగాసన స్పోర్ట్స్ సభ్యులు


మందుబాబు వీరంగం



మాజీ ఉపముఖ్యమంత్రి కారు ముందు తాగుబోతు వీరంగం చేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో ఓ మందుబాబు వీరంగం సృష్టించాడు. మంగళవారం స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద మహానేత వైఎస్సార్ జయంతి కార్యక్రమాలను ముగించుకుని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కారులో వెళ్తుండగా పూటుగా మద్యం సేవించిన ఓ వ్యక్తి అడ్డుగా నిలబడి హల్‌చల్ చేశాడు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అతడిని ఎంతగా బతిమాలినా వైదొలగకుండా దుర్భాలాడుతూ ఇష్టానుసారంగా ప్రవర్తించాడు. చివరికి ట్రాఫిక్ కానిస్టేబుల్ అక్కడకు వచ్చి ఆ వ్యక్తిని బలవంతంగా తీసుకెళ్లడంతో మాజీ ఉపముఖ్యమంత్రి కారు బయలుదేరి వెళ్లింది. కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతుండడంతో పట్టపగలు రోడ్లపై మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. ఎవరైనా నిలదీస్తే కూటమి నాయకుల తాలూకు అని ఫోన్లు వస్తుండడంతో పోలీసులు కూడా వారిని అదుపు చేయలేక చేతులెత్తేస్తున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



గూడెంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ బోణం ఆది ప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం పట్టణంలోని వివిధ సెంటర్లలో గంజాయి రహిత తాడేపల్లిగూడెం బోర్డులను ఏర్పాటు చేశారు. గంజాయిని సరఫరా చేస్తున్న వారి వివరాలను తెలియజేసిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. పట్టణంలోని పాన్ షాపులను తనిఖీ చేసి గుట్కా, పొగాకు పొడి వంటివి విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి

ఇరగవరం: సుపరిపాలన అందించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో 21 గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



